చెరువుల మట్టి.. కొల్లగొట్టి !

- చెరువులు, కొండలను చెరబట్టిన కూటమి నేతలు
- పెద్దాపురంలో పేట్రేగిపోతున్న మట్టి మాఫియా
- ప్రభుత్వ పనుల పేరుతో దారి మళ్లింపు
- లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్ అక్రమ తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి


రాఘవమ్మ చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు


పాకెయిన్లతో మట్టి అక్రమ తవ్వకాలు

పెద్దాపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. మట్టి, గ్రావెల్ ఎక్కడ కనిపించినా కూటమి నాయకుల ప్రోద్బలంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. పచ్చని పంట పొలం, మెట్ట అనే బేధం లేకుండా మట్టి కనబడితే చాలు దానిని తవ్వి తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు.అక్రమ సంపాదనే ధ్యేయంగా ప్రస్తుత కూటమి నేతల దందా యథేచ్ఛగా సాగుతోంది.

ప్రభుత్వ పనుల పేరుతో దందా

కోట్ల రూపాయలు విలువ చేసే రామేశంమెట్టపై ఇప్పటికీ రాత్రనక, పగలనగ నిత్యం గ్రావెల్ దందా కొనసాగుతూనే ఉంది. కట్టమూరు రహదారిలోని పెద్దాపురం పట్టణ పరిధిలో తాత చెరువు, మండలంలోని కట్టమూరు, ఆర్‌బీపట్నం గ్రామాల్లో ప్రభుత్వ పనుల పేరుతో ఇష్టారాజ్యంగా మట్టి, గ్రావెల్ తరలించి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని కూటమి నేతలు కొల్లగొడుతున్నారు. ప్రభుత్వ చెరువుల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలకు అనుమతి గనుల శాఖ నుంచి కాకుండా స్థానిక రెవెన్యూ అధికారుల వద్ద తీసుకుని ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన అనుమతి పత్రంలో ఎంతమేర తవ్వకాలు చేపట్టాలనే విషయాన్ని నమోదు చేయడం లేదు. ఈ అక్రమ దందా కూటమి ప్రజాప్రతినిధుల అండదండలతో పెద్ద స్థాయిలో కొనసాగుతోంది.

లే అవుట్లకు అక్రమంగా గ్రావెల్ తరలింపు

ప్రభుత్వ పనుల పేరుతో మట్టి, గ్రావెల్ తవ్వకాలకు అనుమతి తీసుకున్నారు. అయితే పెత్తనం కూటమి నాయకులది కావడంతో వారికి అనుమతి లేని మరో ఆరు ఎకరాల చెరువుల్లో మట్టి తవ్వి కాకినాడ, పిఠాపురం, ఉండూరు ప్రాంతాల్లోని లే అవుట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు అక్రమ తవ్వకాలపై స్థానిక ప్రజా సంఘాల నాయకులు ఫిర్యాదు చేసినా భారీస్థాయిలో ముడుపులు ముట్టడంతో రెవెన్యూ, మైనింగ్ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

ప్రైవేట్ సైన్యం పహారా

అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేపట్టే ప్రాంతంలో యువకులు ఒక ప్రైవేట్ సైన్యంలా ఉంటూ పహారా కాస్తున్నారు. మట్టి, గ్రావెల్ తవ్వకాలు భారీగా చేపడుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగా చెబుతున్నారు. ప్రైవేట్ సైన్యంలా వ్యవహరించే సుమారు కొంత మంది యువకులు పహారా కాస్తూ ఈ ప్రాంతంలోకి ఎవరూ రాకూడదంటూ అక్కడ వారిని భయాందోళనకు గురిచేస్తున్నారు.

ప్రతి రోజు లారీల్లో 200 ట్రిప్పుల మట్టి తరలింపు

అనుమతి ఇచ్చిన ప్రభుత్వ భూమిలో ఎంతమేర తవ్వకాలు చేపడుతున్నారు. వారికి ఎంత అవసరం ఉంది అనే విషయాలను ఒక్కసారైనా పరిశీలించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూసినట్టు లేదు. అనుమతి ఇచ్చాం మీరు ఎంత కావాలంటే అంతా తవ్వుకోండి అంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులపై తీరుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి రోజు లారీలతో 200 ట్రిప్పుల మట్టిని నిరంతరాయంగా తవ్వి తరలిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి, తవ్వకాలపై పర్యవేక్షించి అనుమతికి మించి మట్టిని, గ్రావెల్‌ను తరలించకుండా చూడాల్సిన అవసరం ఉంది.

అక్రమ మట్టి తవ్వకాలను ఆపాలి



పెద్దాపురం మండలంలో అక్రమ మట్టి తవ్వకాలను ఆపాలి. దీనిపై పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాం. అధికారులు తాత్కాలిక హడావుడి తప్ప కఠిన చర్యలు తీసుకోలేదు. దీనిపై కోర్టులో ప్రైవేట్ కేసు వేస్తాం. చెరువులను, కొండలను గుల్ల చేస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

– గుణ్ణం లక్ష్మణరావు, ఫర్ ది పీపుల్ ఫౌండేషన్ చైర్మన్, పెద్దాపురం

ఎటువంటి అనుమతులూ లేవు



మట్టి తవ్వకాలకు పెద్దాపురంలో ఎటువంటి అనుమతులు లేవు. అనధికార మట్టి తవ్వకాలపై చర్యలు తప్పవు. మైనింగ్ శాఖ అనుమతులపై ఆరాతీస్తాం. మా దృష్టికి వస్తే గతంలో తవ్వకాలు నిలిపివేశాం. ఎక్కడైనా గ్రావెల్, మట్టి అనధికార తవ్వకాలు చేపడితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవు.

– కె.వెంకటలక్ష్మి, తహసీల్దార్, పెద్దాపురం

క్లుప్తంగా

దొరబాబు పరామర్శ


బిక్కిన పరమేశ్వర సాయిని పరామర్శిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: స్థానిక పారిశ్రామిక వేత్త బిక్కిన వెంకటసాయి రాజశేఖర్ కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు శనివారం పరామర్శించారు. ఇటీవల వెంకటసాయి రాజశేఖర్ అనారోగ్యంతో కాకినాడ ఆస్పత్రిలో మృతి చెందిన విషయం విదితమే. రాజశేఖర్ తండ్రి బిక్కిన పరమేశ్వరసాయిని దొరబాబు పరామర్శించారు. రాజశేఖర్ మృతికి సంతాపం తెలిపి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ గుణ్ణం రాజబ్బాయి, సొసైటీ మాజీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా సూరిబాబు పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో రజక వృత్తిదారుల నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం నిర్వహించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా మడకా సత్యనారాయణ, కార్యదర్శిగా పాలెపు లెనిన్ సత్య లోకేశ్వరరావు, ట్రెజరర్‌గా అన్నవరపు గోవిందరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా కొజ్జరపు భద్రరావు, పాలెపు తాతాజీ, కొజ్జరపు శ్రీనివాసరావు, గంధం లోవరాజు, కొజ్జరపు వరప్రసాద్, కొజ్జరపు శ్రీనివాసరావు, పాలెపు బుజ్జి, కుమిలి ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో ఉన్న రజక వృత్తిదారులు పాల్గొన్నారు.

5న ఏపీటీలో స్పాట్ అడ్మిషన్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్లకు ఈ నెల 5న స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్.జనార్దనరావు శనివారం తెలిపారు. డిప్లమో మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఆర్కిటెక్చర్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ కళాశాలలో సీట్లకు అడ్మిషన్లు కల్పిస్తామని, ఆసక్తి గలవారు దరఖాస్తు 4వ తేదీ సాయంత్రంలోగా అందజేయాలని సూచించారు. కౌన్సెలింగ్ ఫీజు ఓసీ, బీసీలు రూ.1100, ఎస్సీ,ఎస్టీలు రూ.350 చెల్లించాలని తెలిపారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులు రూ.4,700 కళాశాల ఫీజు చెల్లించాలన్నారు.

మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి


షేక్ అబ్దుల్ కరీమ్ సాహెబ్ (బాషా)

కాకినాడ రూరల్: మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీగా నియమితులైన షేక్ అబ్దుల్ కరీమ్ సాహెబ్ (బాషా) అన్నారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త కురసాల కన్నబాబుకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. రూరల్ మండలం వాకలపూడికి గ్రామానికి చెందిన బాషా వైఎస్సార్ సీపీలో మైనారిటీ విభాగంలో జిల్లా సెక్రటరీతోపాటు పలు పదవులు చేపట్టారు, వక్ఫ్ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటరు బొత్స సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, సిటీ ఇన్‌చార్జి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖదర్ భాషా తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

తాళ్లూరులో డీపీఓ ఆకస్మిక తనిఖీ

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వి. రవికుమార్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్య పనులు, తడి, పొడి చెత్త సేకరణపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. రక్షిత తాగునీటికి పరీక్షలు నిర్వహించి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓ వీవీఎస్ రామనాథ్, కార్యదర్శి షకీల పాల్గొన్నారు.

ఘనంగా విష్ణు సహస్రనామ పారాయణ

అన్నవరం: రత్నగిరి కళావేదిక మీద శనివారం విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఏలూరు జిల్లా రంగాపురం గ్రామానికి చెందిన వంద మంది భక్తులు విష్ణుసహస్రనామ పఠనం, భజనలు చేశారు. అలాగే కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. కళాకారులతో పాటు ఈ బృందానికి నాయకత్వం వహించిన శ్రీమాన్ పెరుమాళ్‌ను దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు అభినందించారు.

14,921 మందికి అన్నదాత సుఖీభవ

పెద్దాపురం: సూపర్‌సిక్స్‌లో భాగంగా నియోజకవర్గ పరిధిలోని 14,921 మంది రైతుల ఖాతాలకు అన్నదాత సుఖీభవ పథకం సొమ్ము జమ అవుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభంపై ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని ఆయన రైతులతో కలసి వీక్షించారు. ఏడీఏ దైవకుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి విడతగా రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సొమ్ము కలిపి రూ.7 వేలు జమ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని 14,921 మంది రైతులకు రూ.10.11 కోట్ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, ఏఓ సంజయ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీలలిత, తహసీల్దార్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని తిలకించిన కలెక్టరు

సామర్లకోట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు అందజేస్తున్న అన్నదాత సుఖీభవ ప్రత్యక్ష ప్రసారాన్ని శనివారం కలెక్టరు షణ్మోహన్ సగిలి ఉండూరు రైతు సేవా కేంద్రంలో రైతులతో కలిసి తిలకించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పథకాన్ని ప్రారంభించే కార్యక్రమాన్ని ప్రతి రైతు సేవా కేంద్రాల్లో లైవ్ షో ఏర్పాటు చేశారు. కలెక్టరు రైతులతో కలసి కూర్చుని టీవీల్లో ప్రసారమైన ఈ కార్యక్రమాన్ని తిలకించారు. సొసైటీ అధ్యక్షుడు బత్సల వెంకట రమణమూర్తి, డైరెక్టర్లు, గ్రామ రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రమాదకర పరిస్థితులు



స్మార్ట్ మీటర్లు, విద్యుత్తు చార్జీలపై ప్రచార ర్యాలీ

సామర్లకోట: స్మార్ట్ మీటర్లతో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు డిమాండ్ చేశారు. విద్యుత్తు చార్జీల దోపిడీకి నిరసనగా ఈనెల 5న డివిజన్ కేంద్రాల వద్ద చేపట్టనున్న నిరసన, ధర్నాలను జయప్రదం చేయాలని రాజబాబు కోరారు. స్థానిక అమ్మాజమ్మ అపార్టుమెంట్ నుంచి ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ పేద ప్రజల నడ్డి విరిసే స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. కూటమి నాయకులు అధికారంలోనికి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీని విస్మరించి మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల హామీలకు విరుద్ధంగా చంద్రబాబు విద్యుత్తు చార్జీలను పెంచుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు కర్నాకుల రామలింగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకులు రెడ్డి దుర్గాదేవి, ఎస్‌కె అనుష్క, దుర్గాభవానీ పాల్గొన్నారు.

గుడారాలలో నివసిస్తున్న వారికి కౌన్సెలింగ్


గుడారాలలో నివాసం ఉంటున్న వారి గుర్తింపు కార్డులు పరిశీలిస్తున్న సీఐ కృష్ణభగవాన్ తదితరులు

సామర్లకోట: ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఖాళీ ప్రదేశాల్లో గుడారాలు వేసుకొని నివాసం ఉండటం సరికాదని, స్వగ్రామాలకు వెళ్లాలని సీఐ కృష్ణభగవాన్ ఆదేశించారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు డీఎస్పీ డి.శ్రీహరిరాజు సూచనలతో పంచారామ క్షేత్రం, పాత రిజిస్ట్రార్ కార్యాలయం, అమ్మాజమ్మ అపార్టుమెంట్ సమీపంలో గుడారాలు వేసుకొని నివాసం ఉంటున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. గుర్తింపు కార్డులు పరిశీలించి, వారి వద్ద ఉన్న వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరికీ సెల్ ఫోన్‌లో లోన్ ఇస్తామని, లాటరీ మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు 1930 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలు మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు అడపా గరగారావు, డి రమేష్‌బాబు, పీవీఆర్ మూర్తి, జిల్లా క్యూఆర్‌టీ టీము సభ్యులు పాల్గొన్నారు.

శృంగార వల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు


స్వామి వారి దర్శనం కోసం ఆలయం వద్ద భక్తులు


ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతిలోని శృంగార వల్లభుడి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని వివిధ సేవల టికెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.2,90,701 ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 10 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా 3,500 మంది భక్తులకు ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్టు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

తల్లిపాలలో పిల్లలకు అవసరమైన పోషకాలు


కొత్తమూలపేటలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం


చేబ్రోలులో తల్లులను సత్కరిస్తున్న సిబ్బంది

కొత్తపల్లి: కొత్తమూలపేటలో ఉన్న 139 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో లలితనిర్మల మాట్లాడుతూ తల్లిపాలలో పిల్లలకు అవసరమైన పోషకాలుంటాయని అన్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల చిన్నారులకు పలు ఆరోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. తల్లికి రొమ్ము, గర్భాశయం కేన్సర్ వంటి వ్యాధులు రాకుండా నియంత్రించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చేబ్రోలులో తల్లిపాల వారోత్సవాలు

పిఠాపురం: చేబ్రోలు సెక్టార్‌లో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి లక్ష్మి ఆదేశాల మేరకు సీడీపీఓ దుర్గాదేవి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. తల్లిపాలు ఎంత శ్రేష్టమైనవి ఎంత ముఖ్యమైనవి తల్లి పాలు ఇవ్వడం వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలు అలాగే తల్లికి కలిగే ప్రయోజనాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు అధికారుల చేతుల మీదుగా బహుమతులను అందజేసారు. ఏఎన్ఎం లక్ష్మణ్ కుమారి, ఎమ్మెస్ కె.మంగదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. గొల్లప్రోలు పీహెచ్‌సీ పరిధిలో తాటిపర్తి 2 సచివాలయ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమశాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పేరుతో ప్రభుత్వం దోపిడీ



కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న ప్రగతిశీల మహిళా సంఘ సభ్యులు

కాకినాడ సిటీ: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని, విద్యుత్ చార్జీల నిల్వ దోపిడీని ఆపాలని ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీవిముక్తి) నాయకురాలు రెడ్డి దుర్గాదేవి డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 5న మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో విద్యుత్ కేంద్రాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ సూర్యనారాయణపురం ప్రాంతంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేసి విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. మాట తప్పడం చంద్రబాబునాయుడికి పరిపాటిగా మారిందన్నారు. విద్యుత్ ఛార్జీల బాదుడు ఉండదని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత ఛార్జీల బాదుడు మొదలెట్టారని అన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేసి ప్రజలపై భారం మోపే విధంగా కూటమి ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు గంటా సత్యవతి, అగ్రవరపు అప్పల నరసమ్మ, నాగల సరస్వతి, కేతా లక్ష్మి పాల్గొన్నారు.

శాంతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన కమిటీ


నూతనంగా ఎన్నికైన శాంతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: శాంతినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు స్థానిక మహిళా మండలి భవనంలో శనివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా గొడవర్తి సత్యమూర్తి వ్యవహరించారు. అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి సతీష్, కార్యదర్శిగా సిద్ధా సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడిగా మూర్ని జానకిరామ చౌదరి, కోశాధికారిగా డేగల వీరభద్రరావు, సహాయ కార్యదర్శిగా రావు సూర్యారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కొమ్మిరెడ్డి శ్రీరామ నరసింగరావు, బీఎల్ నారాయణరావు, జి.రాంబాబు, పైడా వెంకటనారాయణ, వి.సుబ్రహ్మణ్యం (వెల్లబ్బు), జి.సత్యమూర్తి, ఈహెచ్‌ఎస్ మోహన్, జి.సత్యనారాయణ (నానాజీ), రామచంద్రమూర్తి, పోలిశెట్టి అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్ మాట్లాడుతూ కాలనీ పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్లు, పార్కు అభివృద్ధిపై దృష్టిపెట్టి మెరుగైన సేవలను అందిస్తామన్నారు. నూతన కార్యవర్గానికి కాలనీ ప్రజలు అభినందనలు తెలియజేశారు.

సిమెంట్ బెంచీల వితరణ


కరపలోని దుర్గాదేవి గుడివద్ద ఆటో యూనియన్ నాయకులతో కలసి సిమెంట్ బెంచీని ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు నక్కా బుజ్జి తన తండ్రి నక్కా ధనరాజు (భజన గురువు) జ్ఞాపకార్థం నాలుగు సిమెంట్ బెంచీలు అందజేశారు. కరపలోని పేపకాయలపాలెం రోడ్డులో విజయదుర్గ గుడి వద్ద భక్తులు కూర్చునేందుకు సిమెంట్ బల్లలు కావాలని విజయదుర్గ ఆటో యూనియన్ నాయకులు, పల్లపువీధిలోని గుర్రప్ప చెరువువద్ద కూర్చోవడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయాలని ఆవీధి యూత్ సభ్యులు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలును కోరారు. మాజీ సర్పంచ్ హైస్కూలు టీచర్ నక్కా బుజ్జి దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి, నాలుగు సిమెంట్ బెంచీలు బహూకరించారు. శనివారం దుర్గాదేవి గుడి వద్ద రెండు, గుర్రప్పచెరువు వద్ద మరో రెండు సిమెంట్ బెంచీలను స్థానికులతో కలసి తాతీలు ఏర్పాటు చేశారు. ఆటో యూనియన్ నాయకులు మేడిశెట్టి రామ్‌బుజ్జి, దేవిశెట్టి బుజ్జి, శ్రీపాదం శ్రీను పాల్గొన్నారు.

అధ్యాపకులు బోధనశైలిని అభివృద్ధి చేసుకోవాలి


సర్టిఫికెట్లు అందుకున్న అధ్యాపకులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అధ్యాపకులు నిరంతర విద్యార్థిలా బోధనశైలిని అభివృద్ధి చేసుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఆచరణాత్మక ఆలోచన, పరిశోధనా దృక్పథం పెంపొందించవచ్చని ఎన్ఐఈఏపీ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఎలక్ట్రానిక్స్ ఐసీటీ అకాడమీ, ఎన్ఐటీ వరంగల్ సంయుక్తంగా ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన విద్యావిధానం ప్రకారం అధ్యాపకులు సిలబస్ రూపకల్పనలో తగిన మార్పులు చేసుకోవాలన్నారు.ఇంజినీరింగ్ విద్యలో నాణ్యతను పెంచే దిశగా అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ (ఓబీఈ) కీలక మార్గమని అన్నారు. ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్, మాజీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ అధ్యాపకులు పరిశోధన, ప్రాజెక్టు ఆధారిత బోధనపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రానిక్స్ ఐసీటీ అకాడమీ జాతీయస్థాయిలో నూతన శిక్షణ మాడ్యూళ్లను రూపొందిస్తూ అధ్యాపకుల సామర్థ్యాలను పెంచే దిశగా కృషి చేస్తుందన్నారు.టెక్నాలజీ ఆధారిత బోధన, యాక్టివ్‌లెర్నింగ్, స్టూడెంట్ ఫీడ్‌బ్యాక్ వంటి అంశాలు నూతన విద్యావిధానంలో కీలకమన్నారు. అనంతరం వర్క్‌షాపులో పాల్గొన వారికి సర్టిఫికెట్లు అందజేసారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దీక్షితులు, అధ్యాపకులు లీలాకుమారి, స్వరూపరాణి, మురళీకృష్ణ పాల్గొన్నారు.